అదనపు కలెక్టర్‌కు దరఖాస్తులు అందజేస్తున్న అర్జీదారులు

సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

పెద్దపల్లి, డిసెంబర్ 30: ప్రజావాణిలో వచ్చిన అర్జీలను పరిశీలించి, సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలని అదనపు కలెక్టర్ దాసరి వేణు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి అరీలు స్వీకరిం చారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కబ్జా చేసి వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

ముత్తారం మండలం సీతంపేటలో నదినాల ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని అదే గ్రామానికి చెందిన పులిపాక నగేశ్, జక్కుల ఓదెలు, రావుల రాజ్‌కుమార్ కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చారు. గ్రామంలోని దాదాపు 8 ఎకరాల నదినాల ప్రభుత్వ భూమి ఉండగా, అందులో 30 గుంటలను ఓ వ్యక్తి కబ్జా చేసి సాగు చేస్తున్నారని ఆరోపించారు. కబ్జా చేసిన భూమిని పంచాయతీకి అప్ప జెప్పేలా చర్యలు తీసుకొని, కబ్జాదారుడిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

బాధితులకు భరోసా కల్పించాలి

రికార్డులను పరిశీలిస్తున్న సీపీ శ్రీనివాస్

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబర్ 30 : పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసే బాధితులకు న్యాయం జరుగుతుందనే నమ్మకంతోపాటు భరోసా కల్పించాలని రామగుండం సీపీ ఎం శ్రీనివాస్ పోలీస్ సిబ్బందికి సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా సోమవారం గోదావరిఖని-2 టౌన్ పోలీస్ స్టేషన్‌ను పెద్దపల్లి డీసీపీ చేతన, ఏసీపీ మడత రమేశ్‌తో కలిసి తనిఖీ చేశారు. ముందుగా పోలీస్ సిబ్బంది గౌరవ వందన స్వీకరించి స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం రిసిప్షన్, సెక్షన్ సిబ్బంది పనితీరును, రికార్డులను పరిశీలించారు. ఫిర్యాదుదారులు ఇచ్చిన దరఖాస్తులను అన్‌లైన్ చేస్తున్నారా, వారికి ఏలాంటి భరోసా కల్పిస్తున్నారో ఆయన అడిగి తెలుసుకున్నారు. ఇన్‌వెస్టింగ్‌లో వున్న, పెండింగులో ట్రయల్‌లో వున్న సీడీ ఫైల్‌ను పరిశీలించారు. రోడ్డు ప్రమాదాలు, నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. లా అండ్ ఆర్డర్ సమస్య తలెత్తకుండా గ్రామాల వారీగా రౌడీ షీటర్ వివరాలు, వారి దినచర్యలపై ఎప్పటికప్పుడు సమాచారాన్ని సేకరించాలని సూచించారు. పోలీస్ స్టేషన్ సిబ్బందితో వ్యక్తిగతంగా మాట్లాడి ఏదైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట టౌన్ సీఐ ఎన్. ప్రసాద్ రావు, రెండో సీఐ లింగమూర్తి తదితరులు ఉన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక

జూలపల్లి, డిసెంబర్ 30 : జిల్లాస్థాయి సాంఘిక శాస్త్ర ప్రతిభా పోటీల్లో మండలం నుంచి ఆరుగురు విద్యార్థులు ఎంపిక య్యారు. జూలపల్లిలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం టీఎస్ఎస్‌టీఎఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండలస్థాయి పోటీల్లో మహ్మద్ సోహెల్, అనూష, సాయిప్రసాద్, మధుప్రియ, అశ్విత, సాయినందిని ఎంపికైనట్లు ఎంఈవో సరస్వతి వెల్లడించారు.

మూతపడిన ఎరువుల తయారీ కేంద్రాలు

అబ్బాపూర్‌లో మూతపడిన సేంద్రియ ఎరువుల తయారీ కేంద్రం

- నిర్వహణ మరిచిన అధికారులు..
- నిరుపయోగంగా కంపోస్ట్ షెడ్లు

జూలపల్లి, డిసెంబర్ 30 : రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించి అధిక పంట దిగుబడులు సాధించడానికి ఏర్పాటు చేసిన సేంద్రియ ఎరువుల తయారీ కేంద్రాలు నిర్వహణ లోపంతో మూతపడ్డాయి. ఈ క్రమంలో ఈ కేంద్రాలు మద్యంప్రియులు, పేకాటరాయుళ్లకు అడ్డగా మారుతున్నాయి. పర్యావరణ పరిరక్షణ, భూసారం దెబ్బతినకూడదనే లక్ష్యం ఆవిరైపోతున్నది. జీపీలకు కొంతమేరకు ఆదాయం సమకూర్చిపెడతాయన్న సంకల్పంతో గత ప్రభుత్వం గ్రామానికో సేంద్రియ ఎరువుల తయారీ కేంద్రాన్ని నిర్మించింది. ఈజీఎస్ పథకం కింద అన్ని హంగులతో ఒక్కో కేంద్రానికి రూ. 2 లక్షల పైచిలుకు నిధులు ఖర్చు చేసి పంచాయతీలకు నిర్వహణ బాధ్యతలు అప్పగించింది. కొన్ని సార్లు ఇక్కడ తయారు చేసిన సేంద్రియ ఎరువులను 'తెలంగాణకు హారితహారం'లో భాగంగా నాటిన మొక్కల ఎదుగుదలకు సైతం వాడారు. ప్రజాధనంతో నిర్మించిన కేంద్రాలు ఇప్పుడూ ఎందుకు పనికిరాకుండా పోతున్నాయి. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోడానికి ఇంట్లో తడి, పొడి చెత్త వేరు చేయడానికి రెండు ప్లాస్టిక్ చెత్త బుట్టలు ఇచ్చారు. గతంలో ఇంటా, బయట నిల్వ చేసిన వ్యర్థాలను కేంద్రాలకు తరలించి సేంద్రియ ఎరువుల తయారీకి వినియోగించారు. ప్రస్తుతం గ్రామాల్లో సేకరించిన వ్యర్థాలు కేంద్రాలకు తరలించకుండా విచ్చల విడిగా రోడ్డు పక్కన పడేసి తగులబెడుతుండడంతో పర్యావరణానికి ముప్పు ఏర్పడుతున్నది. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి కేంద్రాల వినియోగంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

మరో మూడు జీపీల ఏర్పాటుకు కసరత్తు

ముత్తారం, డిసెంబర్ 30: మండలంలో కొత్తగా మరో మూడు పంచాయతీ ఏర్పాటుకు అధికారులు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. మండలంలో ఇప్పటికే 15 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అదనంగా మరో మూడు జీపీల ఏర్పాటుకు అధికారులు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే సర్వారం, ఖాసీపల్లి ఈ రెండింటిని కలుపుతూ పంచాయతీగా ఏర్పాటు సంబంధించిన మ్యాప్ తయారు చేశారు. ఇటీవల ఖాసీపల్లి గ్రామస్తులు తమ గ్రామాన్ని పాత గ్రామ పంచాయతీ అయిన లక్కారంలోనే కొనసాగించాలని జిల్లా కలెక్టర్‌కు, ఎంపీడీవోకు వినతి పత్రం ఇచ్చారు. ఖమ్మంపల్లి అనుబంధ గ్రామం రంగయ్యపల్లి, శుక్రవారంపల్లిని కలుపుతూ ఓ జీపీ, అలాగే ముత్తారం, కాసర్లగడ్డ కలిపి మొత్తం సుమారు 3 వేల పైచీలుకు ఓటర్లు ఉన్నారు. దీనిని రెండు గా చేసి కాసర్లగడ్డను గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తుంది. ఇది జరిగితే మండలంలో మొత్తం18 జీపీలు కానున్నాయి.

నినాదాలు చేస్తున్న నాయకులు

ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ వేడుకలు

పెద్దపల్లి టౌన్, డిసెంబర్ 30 : భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆవిర్భావ వేడుకలను జిల్లా కేంద్రంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆర్ల సందీప్ భగత్‌సింగ్ చిత్ర పటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఎస్ఎఫ్ఐ జెండా ఎగురవేశారు. ఇక్కడ జిల్లా ప్రధాన కార్యదర్శి జిల్లెల ప్రశాంత్, ఆర్న కొండ ఆదిత్య, రాజు, విజయ్, సందీప్, గణేశ్, పవీన్, కార్తీక్, అరవింద్ పాల్గొన్నారు.

రుక్మిణీ కల్యాణం

జూలపల్లి, డిసెంబర్ 30 : జూలపల్లిలోని శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో సోమవారం శ్రీకృష్ణ రుక్మిణీల కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. టీటీడీ ఆధ్వర్యంలో ఉత్సవమూర్తులకు కల్యాణం జరిపించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి దేవతామూర్తులను దర్శించుకున్నారు. భక్తులకు అన్న సంతర్పణ చేశారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ కొప్పుల మహేశ్, ఆలయ అర్చకుడు ఉద్దండ నవీన్‌కుమార్, ప్రవచన వక్తలు రామ్మోహన్‌రావు, రమాదేవి, మహిళలు పాల్గొన్నారు.

వివరాలు తెలుసుకుంటున్న పెద్దపల్లి సీఐ ప్రవీణ్‌కుమార్

మద్యం మత్తులో తండ్రిని హత్య చేసిన కొడుకు

- రామారావుపల్లిలో విషాదం

శంకరయ్య(ఫైల్)

పాలకుర్తి, డిసెంబర్30: మద్యం మత్తులో తండ్రిని హత్య చేసిన ఘటన రామారావుపల్లిలో చోటు చేసుకుంది. పోలీసులు, మృతుడి భార్య గట్టమ్మ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన సందవేణి శంకరయ్య (62)కు కుమారుడు రమేశ్, కూతరు ఉన్నారు. శంకరయ్య కేశోరాం మైన్స్‌లో పని చేసి రిటైర్డ్ అయ్యాడు. కుమారుడు రమేశ్ కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. దీంతో కుటుంబంలో తరచూ గొడవలు జరుగుతున్నాయి. రమేశ్ నిత్యం తాగి వచ్చి గొడవ చేస్తుండడంతో తండ్రి శంకరయ్య మందలించేవాడు. దీంతో రమేశ్ తండ్రిపై కక్ష పెంచుకున్నాడు. సోమవారం సాయంత్రం మద్యం మత్తులో ఉన్న రమేశ్ నిద్రలో ఉన్న తండ్రిని పదునైన ఆయుధంతో నరికి చంపేశాడు. రమేశ్‌కు భార్య, పిల్లలు ఉన్నారు. సంఘట స్థలాన్ని బసంత్‌నగర్ ఎస్ఐ స్వామి, పెద్దపల్లి సీఐ ప్రవీణ్ కుమార్ పరిశీలించారు. శవాన్ని పెద్దపల్లి ప్రభుత్వ దవాఖా నకు తరలించారు. నిందితుడు రమేశ్ బసంత్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయాడు.

తల్లి మందలించిందని కొడుకు ఆత్మహత్య

రోహక్(ఫైల్)

ఫర్టిలైజర్‌సిటీ, డిసెంబర్ 30: తల్లి మందలించడంతో కొడుకు ఆత్మహత్య చేసుకున్న ఘటన గోదావరిఖనిలోని మార్కండయకాలనీలో సోమవారం చోటు చేసుకుంది. వన్ టౌన్ ఎస్ఐ రమేశ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రోహక్(16) ఎన్టీపీసీలోని సచ్‌దేవ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్నాడు. ఇటీవల కళాశాలకు గైర్హాజరుతో ప్రీ ఫైనల్ 1 పరీక్ష రాయలేదు. ఎప్పుడూ బయట తిరుగుతూ రాత్రి పూట ఇంటికి వచ్చేవాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి ఆలస్యంగా ఇంటికి వచ్చిన రోహక్‌ను తల్లి రమాదేవి బిడ్డ భవిష్యత్ కోసం మందలించింది. దీంతో మనస్తాపం చెందిన రోహక్ ఇంటిపై ఉన్న పెంట్‌హౌస్ రాడ్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తల్లి రమాదేవి ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పోతనకాలనీలో యువకుడు

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబర్ 30 : గోదావరిఖని టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పోతన కాలనీకి చెందిన సాయి అవినాశ్ (20) సోమవారం తెల్లవారుజామున ఆత్మహత్య చేసుకున్నాడు. సీఐ ప్రసాద్‌రావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఏఎల్‌పీ గనిలో విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్ పోతన కాలనీలోని క్వార్టర్‌లో నివాసం ఉంటున్నాడు. ఇతనికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. పెద్ద కుమారుడు సాయి అవినాశ్ మందమర్రిలోని అమ్మమ్మ ఇంట్లో ఉంటూ, అక్కడే ఐటీఐ చేస్తున్నాడు. ఆదివారం పోతన కాలనీలో తండ్రి వద్దకు వచ్చాడు. స్నేహితులను కలిసేందుకు వెళ్తానని తండ్రికి చెప్పగా, వద్దని వారించాడు. దీంతో ఆవేదనకు గురైన యువకుడు మరుసటి రోజు తెల్లవారుజామున బెడ్‌షీట్‌తో ఉరి వేసుకొని కనిపించాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వైద్య శిబిరానికి స్పందన

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబర్ 30 : ఆర్జీ-2 యాజమాన్యం ప్రభావిత గ్రామం పెంచికల్‌పేటలో సోమవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఏరియా ఎస్ వోటూ జీఎం రాముడు శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ మహిపాల్, పర్యావరణ అధికారి వేణు, బ్రాంచి కార్యదర్శి రవీందర్, మాజీ సర్పంచ్ వెంకటేశ్, డీజీఎం(ప) అనిల్ కుమార్‌లు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

ఫర్టిలైజర్‌సిటీ, డిసెంబర్ 30: గోదావరిఖనికి చెందిన ఇద్దరు న్యాయవాదులు ఇటీవల ప్రభుత్వ న్యాయవాదులుగా నియామకం కాగా, సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గోదావరిఖని అదనపు జిల్లా న్యాయస్థానంలో అదనపు గవర్నమెంట్ ప్లీడర్‌గా సీనియర్ న్యాయవాది బీ శాంతన్‌కుమార్, గోదావరిఖని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏజీపీగా నియమితులైన కొడు సౌజన్య ఆయా కోర్టుల్లో బాధ్యతలు చేపట్టారు. అనంతరం కలెక్టర్ కోయ శ్రీహర్షను కలెక్టరేట్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఇక్కడ గోదావరిఖని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తౌటం సతీశ్ ఉన్నారు.

ప్రతిభావంతులైన క్రీడాకారులకు తోడ్పాటు

క్రీడాకారుడికి కాంపౌండ్ బో అందిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి, డిసెంబర్30: క్రీడల్లో ప్రతిభ చూపిన వారికి అవసరమైన తోడ్పాటు అందిస్తామని కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సోమవారం ఆర్చరీ క్రీడాకారుడు ధీరజ్ రావుకు కాంపౌండ్ బో అందజేశారు.రామగుండానికి చెందిన ధీరజ్ రావు జాతీయ స్థాయి విలువిద్య పోటీల్లో ప్రతిభ చూపాడు. తనకు కాంపౌండ్ బో కావాలని కలెక్టర్‌కు దరఖాస్తు చేసకున్నాడు. కలెక్టర్ రూ. 4, 43,300 మంజూరు చేయించి కాంపౌండ్ బోను క్రీడాకారుడికి అందజేశారు. ఇక్కడ జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి సురేశ్, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కొమ్మురోజు శ్రీనివాస్, వీ సురేందర్, డీ రమేశ్, ధీరజ్ రావు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అక్రమ పట్టారద్దు చేయండి

మాట్లాడుతున్న ఇనుగాల రాములు

కాల్వశ్రీరాంపూర్, డిసెంబర్ 30: పదేళ్ల క్రితం తాను కొనుగోలు చేసిన భూమిని విక్రేత ఇతరులకు అక్రమంగా పట్టా చేశాడని, ఆ పట్టాను రద్దు చేసిన భూమిని తనకు ఇప్పించాలంటూ కాల్వశ్రీరాంపూర్ కు చెందిన ఇనుగాల రాములు మొరపెట్టుకున్నాడు. కాల్వశ్రీరాంపూర్‌లో సోమవారం ఆయన మాట్లాడారు. పదేళ్ల క్రితం వెనిశెట్టి రమేశ్ వద్ద సర్వే నంబర్ 169/ఏబీసీ, 167/ఏ, ఏ/1లో 3.36 ఎకరాల భూమిని కొనుగోలు చేశానని తెలిపారు. అప్పటి నుంచి తనకు పట్టా చేయాలని ఎన్నిసార్లు రమేశ్ వద్దకు వెళ్లినా తనకు పట్టా చేయలేదన్నారు. ఇటీవల మరో వ్యక్తికి అక్రమంగా పట్టా చేశాడని ఆరోపించారు. తనకు విక్రయించిన భూమిని ఇతరులకు పట్టా చేయవద్దని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశానని తెలిపారు. మొఖాపై ఉన్న తనకు పట్టా చేయాలని మొరపెట్టుకున్నాడు.

నల్ల జెండాలతో వామపక్షాల నిరసన ప్రదర్శన

నల్ల జెండాలతో నిరసన తెలుపుతున్న వామపక్ష నాయకులు

కోల్‌సిటీ, డిసెంబర్ 30: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను అవమానిస్తూ కేంద్ర మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ గోదావరిఖనిలో వామపక్ష పార్టీల నాయకులు సోమవారం నల్ల జెండాలతో నిరసన ప్రదర్శన చేపట్టారు. రామగుండం మున్సిపల్ టీ జంక్షన్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి ముందుగా పూలమాల వేసి అనంతరం నిరసన తెలిపారు. రాజ్యాంగం మీద గౌరవం లేకుండా మాట్లాడిన అమిత్ షాను ఆ పదవి నుంచి బర్తరఫ్ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.యాకయ్య డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ, సీపీఐఎంఎల్ నాయకులు తోకల రమేశ్, ఐ కృష్ణ, కే.విశ్వనాథ్, కుమార్, మహేశ్వరి, ఈ నరేశ్, తూళ్ల శంకర్, భీమయ్య, మహేశ్వరి, రాజేశ్వర్,రాజేందర్, లచ్చన్న, భిక్షపతి, నర్సయ్య, శివ, సతీశ్, రాజయ్య, సమీర్, శ్రీనివాస్, సుజాత, వాణి, అంజలి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభా పోటీలు

ప్రశంసా పత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

ఓదెల, డిసెంబర్ 30: ఓదెల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సోమవారం మండల స్థాయి సాంఘిక శాస్త్ర ప్రతిభా పోటీలు నిర్వహించారు. ఇందులో మండలంలోని ఐదు హైస్కూళ్లతో పాటు కస్తూర్బాగాంధీ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో మొదటి స్థానంలో మచ్చ హర్షిని (కనగర్తి), ద్వితీయ స్థానంలో అక్షయ (కనగర్తి), మూడో స్థానంలో క్రీస్తోలైట్ నిలిచారు. కేజీబీవీ, మోడల్ స్కూల్ పాఠశాలల టాలెంట్ టెస్ట్‌లో మోడల్ స్కూల్ విద్యార్థి అభిజ్ఞ మొదటి స్థానం, అమృత వర్షిణి రెండో స్థానంలో నిలిచారు. ప్రతిభ చూపిన వారికి ప్రశంసా పత్రం అందించి, అభినందించారు. కార్యక్రమంలో ఎంఈవో రమేశ్, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పుట్నూర్ ఏఎంసీ చైర్మన్‌గా గడ్డం తిరుపతి

గడ్డం తిరుపతి

పాలకుర్తి, డిసెంబర్30: పాలకుర్తి మండలం ఈసాలతక్కళ్లపల్లికి చెందిన యువ నాయకుడు గడ్డంతిరుపతిని పుట్నూర్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమిస్తూ ఏపీసీ సెక్రెటరీ ఎం.రఘునందనరావు సోమవారం ప్రకటన విడుదల చేశారు. పాలకుర్తి, అంతర్గాం, రామగుండం మండలాలకు సంబంధించిన పుట్నూర్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా గడ్డంతిరుపతి(ఈసాలతక్కళ్లపల్లి), వైస్‌చైర్మన్‌గా మడ్డి తిరుపతిగౌడ్(బ్రాహ్మణపల్లి)లను నియమించారు. డైరెక్టర్లుగా మాదాసు రమేశ్, మంచినీళ్ల బాబు నాథ్, తోట ప్రశాంత్, దాడి కావ్య, ఎర్రం హరినాథ్‌రెడ్డి, అమోగోత్ సూరి, పానగంటి సత్యనారాయణ, మాదాసు రేణుక, బాలసానికుమార్, మంథెన మహేందర్, ముచ్చకుర్తి కనుకయ్య, పుల్లూరి శ్రీనివాస్‌లను నియమిస్తూ ఆదేశాలు జారీచేశారు.

నాగెపల్లి జడ్పీహెచ్ఎస్‌లో ప్రతిభా పోటీలు

రామగిరి, డిసెంబర్ 30: మండలంలోని నాగెపల్లి గ్రామంలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం మండల స్థాయి ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థు హాజరు కాగా, ప్రథమ స్థానంలో జే.తేజస్విని (కల్వచర్ల), ద్వితీయ స్థానం డీ.శ్రీజ (చందనాపూర్), తృతీయ స్థానంలో వీ.రిషీత (కల్వచర్ల) ప్రతిభ కనబరిచారు. కేజీబీవీ విభాగంలో పీ.సింధూజ, ఎస్. శ్రీజ, వీ.సింధులు ప్రతిభ కనబరిచినట్లు మండల విద్యాధికారి కొమురయ్య తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం మాధవి, జే.సత్యనారాయణ మూర్తి, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు, ఇంటిపని, వంటపని చేయుటకు వర్కర్లు, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 20K. 8977639662 / 8977639663.
NT-338992-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 9182 777 571
9182 777 189

ప్రధానోపాధ్యాయుడిపై దాడి సరికాదు

పెద్దపల్లి టౌన్ : దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

పెద్దపల్లి టౌన్, డిసెంబర్ 30: రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడ ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం రాములుపై భక్తి ముసుగులో దాడిచేసి అవమానించిన దుండగులను శిక్షించాలని, ఈ దాడిని ప్రజాస్వామిక వాదులు ఖండించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు అన్నారు. పెద్దపల్లి జెండా చౌరస్తాలో సోమవారం మతోన్మాదుల దిష్టి బొమ్మను దహనం చేశారు. హెచ్ఎం పట్ల అమర్యాదగా ప్రవర్తించిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఇక్కడ నాయకులు సీపల్లి రవీందర్, మోదుంపల్లి శ్రావణ్, వెంకటస్వామి, రాజు, నవీన్, రామ్, చందర్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ నిరసన

జ్యోతినగర్(రామగుండం), డిసెంబర్ 30: రంగారెడ్డి జిల్లాలో దళిత హెచ్ఎం రాములుపై జరిగిన దాడిని ఖండిస్తూ సీఐటీయూ ఎన్టీపీసీ, రామగుండం ఏరియా కమిటీ సోమవారం రామగుండం అంబేద్కర్‌చౌక్ వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టింది. దాడికి పాల్పడిన వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసునమోదు చేయాలని నినాదాలు చేశారు. ఇక్కడ సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్ భిక్షపతి, కోశాధికారి ఎం రామాచారి, ఏరియా కన్వీనర్ గీట్ల లక్ష్మారెడ్డి, తుంగపిండి మల్లేశ్, హమాలీ సంఘం నాయకులు ఎల్లయ్య, మార్తపోచం, వెంకటేశ్, సతీశ్, దాసరి కృష్ణ, బానోతు శారద, నర్సయ్య, కౌసల్య, వెంకటేశ్ ఉన్నారు.

మా పనులు చేయొద్దు.. మా కడుపులు కొట్టొద్దు

పెద్దపల్లి కమాన్, డిసెంబర్ 30 : మా పనులు చేయొద్దు.. మా కడుపులు కొట్టొద్దు.. అంటూ సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు తమ నిరసన వ్యక్తం చేశారు. తమ డిమాండ్ల పరిష్కారం కోసం జిల్లా కేంద్రంలో 22 రోజులుగా నిరవధిక దీక్ష చేస్తున్న ఉద్యోగులు సోమవారం దీక్షా శిబిరం ముందు రోడ్డుపై వివిధ రకాల ముగ్గులు వేసి తమ నిరసన తెలిపారు. ఇటీవల కొన్ని జిల్లాల్లోని కేజీబీవీల్లో విద్యార్థులకు పాఠాలు బోధించేందుకు ప్రభుత్వ టీచర్లను డిప్యూటేషన్‌పై పంపించడాన్ని నిరసిస్తూ..'మా పనులు చెయొద్దు..మా కడుపులు కొట్టొద్దు..' అంటూ క్రాఫ్ట్ అండ్ ఆర్ట్ (పీటీఐ) టీచర్లు వేసిన ముగ్గు ఉద్యోగులందర్నీ భావోద్వేగానికి గురి చేసింది..

క్రాఫ్ట్ అండ్ ఆర్ట్ టీచర్లు వేసిన ముగ్గు

వేడుకలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

మాట్లాడుతున్న పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ

పెద్దపల్లి టౌన్, డిసెంబర్ 30 : న్యూ ఇయర్ వేడుకలు ప్రశాంత వాతరణంలో నిర్వహించుకోవాలని పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ తెలిపారు. పెద్దపల్లి ఏసీపీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. యువకులు మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. మంగళవారం రాత్రి 10 గంటల నుంచే పెట్రోలింగ్, విస్తృత తనిఖీలు చేపడుతామని స్పష్టం చేశారు. యువకులు రోడ్ల మీద బైక్‌లపై ట్రిపుల్ రైడ్ చేయొద్దని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకోవడంతోపాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇక్కడ సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐలు లక్ష్మణ్ రావు, మల్లేశ్ పాల్గొన్నారు.